
సాక్షి తిరుపతి

సోమవారం । 26 । మే । 2025



కోవిడ్ అలెర్ట్

కోవిడ్ మహమ్మారి మళ్లీ కోరలు చాస్తోంది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. - 8లో



రెచ్చిపోతున్న మట్టి మాఫియా

రేణిగుంట మండలం వెంకటాపురం చెరువును మట్టి మాఫియా కబళిస్తోంది. టీడీపీ నేతల అండతో రెచ్చిపోతోంది. - 8లో



ఈఓ ఎవడ్రా.. ఇక్కడ మాదే రాజ్యం

తిరుపతి స్విమ్స్‌లో సెక్యూరిటీ సిబ్బంది చెలరేగిపోతున్నారు. రోగులు.. సహాయకులపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. - 8లో



హిటాచీతో తవ్వకం



భారీ టిప్పర్లతో రవాణా

మట్టి.. కొల్లగొట్టి

చిట్టమూరు మండలంలోని రావిగుంట చెరువును కూటమి నేతలు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేసి.. టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాకపోకలకు తెలుగుగంగ 7వ బ్రాంచ్ కెనాల్‌ను సైతం ధ్వంసం చేసి రోడ్డు వేసేసుకున్నారు. దీనిపై తహసీల్దార్‌ను ప్రశ్నిస్తే.. తాము ఎవరికీ అనుమతుల ఇవ్వలేదని తేల్చేస్తున్నారు.

– నాయుడుపేట టౌన్/ చిట్టమూరు



రావిగుంట చెరువులో యంత్రాలతో తవ్వకాలు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, శ్రీపద్మావతి కళాశాల్లోని పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్, జిల్లా ప్రతేక అధికారి కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ ఎస్‌జీ అజ్మీరా, డీఆర్‌ఓ నరసింహులుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం ఉదయం నిర్వహించిన పరీక్షకు 5,261 మందికి గాను 2,941 మంది అభ్యర్థులు హాజరైనట్లు వెల్లడించారు. 2,320 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 5,261 మందికి గాను 2,929 మంది హాజరైనట్లు తెలిపారు. 2,332 మంది గైర్హాజరైనట్లు వివరించారు. అభ్యర్థులు ఏమాత్రం ఇబ్బంది పడకుండా పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు.

ముగిసిన లాసెట్ దరఖాస్తుల గడువు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాసెట్–2025 ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుముతో దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. వచ్చే నెల 5వ తేదీన జరగనున్న లాసెట్ పరీక్షకు 27,217 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు

భయపెడుతున్న బయో వేస్ట్

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన బయో మెడికల్ వేస్ట్ భయపెడుతోంది. ఐడీహెచ్ వార్డు వెనుక టన్నుల కొద్దీ బయో మెడికల్ వేస్ట్‌ను డంపింగ్ చేశారు. ప్రతిరోజూ తరలించాల్సిన వేస్ట్‌ను ఆరు నెలలుగా తొలగించలేదు. దీనికితోడు చెత్తాచెదారాలను సైతం అందులోనే పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలకు తడిచిన వ్యర్థాల నుంచి విషపూరిత రసాయనాలు భూమిలోకి ఇంకుతున్నాయి. ఈ క్రమంలో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదముంది. దీనిపై నిపుణులు హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించి బయోవేస్ట్‌ను వెంటనే తొలగించాల్సిన అవసరముంది.



రుయా ప్రాంగణంలో పేరుకుపోయిన వ్యర్థాలు

శ్రమైక జీవనం

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న తల్లిదండ్రులు
- డబ్బు విలువ తెలిసేలా జాగ్రత్తలు
- కుల వృత్తులపై అవగాహన కల్పించేలా చర్యలు
- కష్టం తెలుసుకుని ఉన్నతంగా ఎదిగితే చాలంటున్న పేరెంట్స్

నేటి సమాజంలో యువత పెదదారి పడుతోంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తోంది. విచ్చలవిడిగా దురలవాట్లకు బానిసలుగా మారి భవితను నాశనం చేసుకుంటోంది. తమను చదివించేందుకు తల్లిదండ్రులు పడే కష్టనష్టాలను గుర్తించేందుకు సైతం ఆసక్తి చూపని దుస్థితికి చేరింది. ఈ క్రమంలో సామాన్యులు తమ పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ అవసరాలను సైతం త్యాగం చేస్తున్నారు. అయితే బిడ్డలను ఉన్నత స్థాయికి చేర్చేందుకు తాము శ్రమించే పరిస్థితులను ప్రత్యక్షంగా పిల్లలకు చూపించకపోవడమే ఇందుకు కారణంగా పలువురు విద్యావంతులు వెల్లడిస్తున్నారు. అహర్నిశలు శ్రమించే తల్లిదండ్రులు తమ ఇక్కట్లపై కడుపున పుట్టిన వారికి అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. పైసా విలువను చిన్ననాటి నుంచే తెలియజేయాలని కోరుతున్నారు. తమ ఫీజులు.. దుస్తులు.. పుస్తకాలు.. ఖర్చులకు డబ్బు ఎలా వస్తోందో వివరించాలని చెబుతున్నారు. ఈ మేరకు పలువురు నిరుపేద తల్లిదండ్రులు ఎందరికో మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. వేసవి సెలవులను తమకు అనుకూలంగా మలచుకుని పిల్లలను తమ వెంట కుల వృత్తులు.. చిరువ్యాపారాలకు తీసుకెళుతున్నారు. బిడ్డలకు బతుకు పాఠం నేర్పేందుకే తమ ప్రయత్నమని స్పష్టం చేస్తున్నారు.

– తిరుపతి సిటీ



పిల్లలకు తెలియాలి

మాది చిత్తూరు జిల్లా పూతలపట్టు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. రోజూ తిరుపతికి వచ్చి తాటిముంజెలు అమ్ముతుంటా. మా అబ్బాయి 8వ తరగతి పూర్తి చేసుకుని 9లోకి వెళుతున్నాడు. వచ్చేనెల పాఠశాల ప్రారంభం అవుతుంది. ఫీజు కట్టాలి.. పుస్తకాలు.. దుస్తులు కొనాలి. ఇందుకోసం నేను ఏం చేస్తున్నానో నా బిడ్డకు తెలియాలి. డబ్బు ఎలా వస్తుంది..అనే విషయం పిల్లలకు తప్పకుండా తెలియాలి. వేసవి సెలవులలో ఇంటి దగ్గర వదిలేస్తే విచ్చలవిడిగా తిరుగుతుంటారు. అందుకే ప్రతి రోజూ నాతోపాటు తీసుకువస్తున్నా. తాటి ముంజెలు అమ్మడంలో నా కష్టాన్ని నేరుగా చూస్తున్నాడు. భవిష్యత్‌లో మానాన్న లాగా కష్టపడకూడదు అనుకోవాలి.. బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలనే కోరిక కలగాలి.

– విద్యార్థి జీవన్ కుమార్‌తో తండ్రి మధు, తాటి ముంజెల వ్యాపారి


తల్లిదండ్రులను అభినందించాలి



చిన్ననాటి నుంచి పిల్లలకు కష్టం విలువ తెలియజేయాలి. కొందరు ఎంత డబ్బులు అడిగితే అంత చేతికి అందించి పెడదోవ పట్టిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. రూపాయిని ఎలా సంపాదిస్తున్నారనే విషయాన్ని చిన్ననాటి నుంచే పిల్లలకు ప్రత్యక్షంగా తెలియజేస్తే మంచిది. కొందరు తల్లిదండ్రులు సెలవులలో వారి బిడ్డలను వెంట తీసుకుని బతుకు విలువ నేర్పిస్తున్నారు. వారిని తప్పనిసరిగా అభినందించాలి. వారి పిల్లల జీవితాలను మార్చేందుకు ఇదే తొలిమెట్టుగా చెప్పవచ్చు.

– లక్ష్మీదేవమ్మ, విశ్రాంత ఉపాధ్యాయిని, తిరుపతి

బాధ్యత తప్పనిసరి



ఆధునికత పేరుతో చిన్నపిల్లలు సైతం స్మార్ట్‌ఫోన్లు, బెట్టింగ్ గేమ్స్, చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. పేరెంట్స్‌పై తిరగబడుతున్నారు. చదువును పూర్తిగా విస్మరిస్తున్నారు. ఈ దుస్థితి నుంచి యువతను గట్టెక్కించాలంటే ముందుగా తల్లిదండ్రులకు బాధ్యత తప్పనిసరి. చిన్ననాటి నుంచే కుటుంబ పరిస్థితితోపాటు కష్టం విలువ తెలియజేయాలి. గొప్పలకు పోకుండా బిడ్డలకు పైసా రాకపోకలపై అవగాహన కల్పించాలి.

– మునిరామయ్య, విశ్రాంత ప్రభుత్వోద్యోగి, తిరుపతి



కష్టం తెలుసుకోవాలనే..

మా అబ్బాయి ఈ ఏడాది 10వ తరగతి. నేను పండ్ల వ్యాపారం చేస్తుంటా. వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివిస్తున్నా. నేను రూపాయిని ఎలా సంపాదిస్తున్నానో, ఫీజు ఎలా కడుతున్నానో, చేతిఖర్చులకు డబ్బు ఎలా ఇస్తున్నానో పిల్లలకు తెలియాలి. అందుకే ప్రతిరోజు మా అబ్బాయిని వెంట తీసుకుని వస్తున్నా. వేసవి సెలవులలో ఇంటి దగ్గర ఉంటూ సెల్‌ఫోన్ పట్టుకోవడం, స్నేహితులతో తిరగడం తప్ప చేసేదేమీ ఉండదు. దీనికి అడ్డుకట్టవేసి తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలకు ప్రత్యక్షంగా చూపిస్తే వారు కొంతమేర అర్థం చేసుకుంటారనే నమ్మకం ఉంది. మా కష్టాన్ని చూసి బాగా చదువుకుంటాడనే మా ఆశ.

– విద్యార్థి చైతన్యతో తండ్రి టి.భానుప్రకాష్, పండ్ల వ్యాపారి, తిరుపతి



వృత్తి తెలుసుకోవాలి

మా అబ్బాయి ఈ ఏడాది 10వ తరగతి పాస్ అయ్యాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేర్పిస్తున్నాం. మాది లాండ్రీ షాపు. నేటి పిల్లలు తమ తల్లిదండ్రులు ఎలా సంపాదించి వారిని చదివిస్తున్నారో అర్థం చేసుకోవడం లేదు. కనీసంకులవృత్తిపైనా అవగాహన ఉండడం లేదు. అందుకే వేసవి సెలవులు కాబట్టి మా అబ్బాయిని షాపు దగ్గరకు తీసుకువస్తున్నా. మా వృత్తిపై అవగాహన కల్పిస్తున్నా. కష్టాన్ని ప్రత్యక్షంగా చూడడం వల్ల పిల్లలు మరింత కసితో ఉన్నతంగా చదివి మంచి ఉద్యోగం సాధించేందుకు అవకాశముంటుంది.

– విద్యార్థి కార్తీక్‌తో తండ్రి నరసింహులు, లాండ్రీ షాపు, తిరుపతి



చేదోడుగా ఉంటాడు

ప్రస్తుతం పిల్లలను చదివించాలంటే రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీంతోపాటు వారికి రోజువారీ పాకెట్ మనీ అందించాలి. దుస్తులు, పుస్తకాలు ఇలా ఎన్నో కొనాలి. మాలాంటి సామాన్యులం కుటుంబ అవసరాలతో పాటు పిల్లలను చదివించాలంటే భారంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రుల కష్టాలను బిడ్డలు తెలుసుకుని బాగా చదువుకుని కుటుంబానికి ఆదరువుగా నిలబడాలి. ఈ విషయంలో మేం కొంత వరకు అదృష్టవంతులమే. మా అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. మేము చిన్న టిఫిన్ అంగడి నడుపుతున్నాం. మా కష్టం అర్థం చేసుకుని సెలవులలో మాకు చేదోడుగా ఉంటాడు. ఊరెమ్మట తిరగకుండా మాకు సహకరిస్తుంటాడు.

– విద్యార్థి చరణ్‌తో తల్లి మాధవి, టిఫిన్ దుకాణం, తిరుపతి

ఆర్‌ఎస్‌కే.. అంతా హుళక్కే!

- అలంకారప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- రేషనలైజేషన్ పేరుతో నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



రైతు సేవా కేంద్రం

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) విశేష సేవలందించాయి. అయితే కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే)గా మార్చేసింది. అయితే సేవలను మాత్రం రైతులకు పూర్తిగా దూరం చేసేసింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిందనే కారణంతోనే ఆయా కేంద్రాలను నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాయితీ విత్తనాలు, ఎరువులను సకాలంలో పంపిణీ చేయకుండా వేధిస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 442 రైతు సేవాకేంద్రాల్లో కేవలం 340 మంది మాత్రమే అగ్రికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారని వాపోతున్నారు. దీంతో భూసార పరీక్షలు సక్రమంగా చేసే పరిస్థితి కనిపించడం లేదని వెల్లడిస్తున్నారు. అలాగే సాగులో వినూత్న విధానాలపై సలహాలు అందించేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు 55శాతం ఆర్‌బీకేలకు సొంత భవనాలు నిర్మించారని, అయితే కూటమి పాలనలో మాత్రం పూర్తిగా విస్మరించారని మండిపడుతున్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంగా రూ.20వేల చొప్పున అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించి గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రైతు సేవాకేంద్రాలను సైతం తమకు దూరం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. క్లస్టర్ల కింద రేషనలైజేషన్ పేరుతో ఆర్‌ఎస్‌కేలను తగ్గించి సేవలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలు మానుకోవాలి



రైతు సేవా కేంద్రాల నిర్వహణపై కూటమి ప్రభుత్వం రాజకీయాలు మానుకోవాలి. రైతులకు ప్రయోజనం చేకూర్చే విషయంలో ఉదారంగా వ్యవహరించాలి. క్లస్టర్ల కింద వాటిని మరింత తగ్గించాలని యత్నించడం అన్యాయం. వెంటనే ఇలాంటి నిర్ణయాలను ఉపసంహరించుకుంటే మంచిది. – వెంకటేష్, రైతు

మంచిది కాదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కారించాలనే ఉద్దేశంతో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు వాటిని కుదించాలనుకోవడం మంచిది కాదు. గతంలో మాదిరిగానే ఆర్‌ఎస్‌కేల నుంచి విత్తనాలు, ఎరువులు, ఇతర పరికరాలను అందించాలి. లేకుంటే రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. – శేఖర్, రైతు

ఇబ్బందులు తప్పవు



రైతు సేవా కేంద్రాలు ఉపయోగకరం. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రతి గ్రామంలో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకవచ్చింది.తాజాగా కూటమి ప్రభుత్వం క్లస్టర్ల పేరుతో నాలుగు నుంచి ఐదుకేంద్రాలను ఒక్కటిగా చేయడం సరికాదు. దాంతో ఐదు గ్రామాల వారు ఒకే చోటుకు వెళ్లాల్సివస్తుంది. దీంతో ఇబ్బందులు తప్పవు. – నరేంద్రయాదవ్, రైతు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌డే

తిరుపతి అర్బన్:కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అలాగే డివిజన్, మండల కార్యాలయాల్లోను అదే సమయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలు తెలియజేయడానికి ఆ సమయంలో మాత్రమే రావాలని పేర్కొన్నారు.

పరాశురేశ్వరుని సేవలో పురావస్తుశాఖ అధికారి



ఆలయంలో నిఖిల్‌దాస్, కుటుంబసభ్యులు

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరాశురేశ్వరస్వామివారిని ఆదివారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హంపీ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ నిఖిల్‌దాస్ సేవించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుంకీలతో భీ‘కరి’ కట్టడి

తిరుపతి మంగళం : అటవీ ప్రాంతంలో నుంచి బయటకు వస్తున్న మద గజాలను కుంకీ ఏనుగులతో కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ ఆదేశించారు. ఆదివారం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలోని ఎలిఫెంట్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పలమనేరులోని క్యాంపుతో పాటు జూ పార్కును కూడా కుంకి ఏనుగుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన ఏనుగులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. గజ దాడులలో ఒక్కరు కూడా మృత్యువాత పడకుండా, పంట పొలాలు నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జూ పార్క్ లోని వన్యప్రాణుల స్థావరంలో పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. అనంతరం జంతువుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. జూలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి సీఎఫ్ సెల్వం, అనంతపురం సీఎఫ్ యశోదాబాయి పాల్గొన్నారు.



సూచనలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్‌నాయక్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

వరదయ్యపాళెం: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం.. ఇందిరానగర్‌కు చెందిన జడ సాయిప్రసాద్ (29) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ ఉద్యోగం మానేశాడు. గొర్రెల పెంపకం ద్వారా కుటుంబ పోషణ చేపట్టాలని, అందుకు గొర్రెల కొనుగోలు కోసం నగదు ఇవ్వాలని తల్లిదండ్రులకు విన్నవించాడు. అయితే తనయుడు సాయిప్రసాద్ తాగుడుకు బానిస కావడంతో నగదు ఇచ్చినా వృథా చేస్తాడని వారు నగదు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన సాయిప్రసాద్ 15 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడిని శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మూడు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నాడు. మరోమారు శుక్రవారం కడుపునొప్పి రావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి యువకుడు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. మృతునికి భార్య ఉంది.

రైలు కింద పడి మరొకరు,,

తొట్టంబేడు: తొట్టంబేడు మండలం కాసరం యానాదికాలనీకి అశోక్ ఆదివారం శ్రీకాళహస్తి మండలం యల్లకారు వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా



వెంకటాపురం చెరువులో జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న దృశ్యం

రేణిగుంట : మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. టీడీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడుతోంది. ఇరిగేషన్ అధికారుల అండతో మట్టిని కొల్లగొడుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం వెంకటాపురం చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించింది. మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే రోడ్డు నిర్మాణానికి మట్టి సరఫరా చేస్తున్నట్లు బుకాయించింది. ఇదే అక్కడకు టీడీపీ నేతలు చేరుకున్నారు. ఇరిగేషన్ అధికారుల అనుమతితోనే మట్టి తవ్వుతున్నట్లు వెల్లడించారు. దీనిపై ఇరిగేషన్ ఏఈకి ఫోన్ చేస్తే ఆయన తనకు తెలియదని, మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. అయితే వెంకటాపురం చెరువులో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ఈ మేరకు గ్రామస్తులు ప్రశ్నిస్తే టీడీపీ నేతలే దురుసుగా ప్రవర్తించడం గమనార్హం.

ఘాట్ రోడ్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వస్తున్న శ్రీవారి భక్తులు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కర్నాటకకు చెందిన భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఒకటో మలుపు వద్ద కారు కొండను ఢీంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తుల్లో ఇద్దరికి చిన్నపాటి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కోవిడ్ మహమ్మారి మళ్లీ కోరలు చాస్తోంది.. ఇప్పటికే విశాఖ, కడప, చెన్నై, బెంగళూరు నగరాల్లో కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి జిల్లాలకు దేశవ్యాప్తంగా యాత్రికులు వస్తుంటారు. ఈ క్రమంలో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే భయపడాల్సిన అవసరం లేదని అధికార యంత్రాంగం మాత్రం చేతులు దులుపుకుంటోంది.

ఆస్పత్రిలోని బెడ్లు (ఫైల్)



కోవిడ్ అలెర్ట్



- జిల్లా సరిహద్దుల్లో కరోనా కేసులు
- ముందస్తు జాగ్రత్తలకు ప్రభుత్వం ఆదేశం
- అప్రమత్తం కానీ ఆస్పత్రులు
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో మళ్లీ కరోనా అలజడి మొదలైంది. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కరోనా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించింది. ముఖ్యంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు తప్పనిసరిగా వాడాలని పేర్కొంది. అయితే ఆస్పత్రుల్లో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. కనీస ఏర్పాట్లు కరువయ్యాయి. ఆస్పత్రి అధికారుల్లో నిర్లిప్తత నెలకొంది.

జిల్లాను కరోనా ఫీవర్ పట్టుకుంది. నిత్యం వేలాదిగా తిరుపతి వెళ్లేందుకు భక్తులు చిత్తూరు మీదుగానే వెళుతుంటారు. ఇదే మాదిరిగానే కాణిపాకంకు వేలాదిగా యాత్రికులు తరలివస్తుంటారు. దీనికితోడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు జిల్లా సరిహద్దులోనే ఉంది. స్వామి దర్శనంతో పాటు వివిధ పనుల నిమిత్తం రోజువారీగా సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లాకు రాకపోకలు చేస్తున్నారు. ఈ తరుణంలో జిల్లాకు కరోనా ముప్పు పొంచి ఉందని పలువురు భావిస్తున్నారు.

గతంలో సుమారు 2 వేల మంది మృతి

2019లో కరోనా కల్లోలం ఉమ్మడి జిల్లా నుంచే మొదలైన సంగతి అందరికీ తెలిసిందే..అప్పట్లో తొలి కేసు శ్రీకాళహస్తిలో నమోదు కాగా ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కరోనా బెల్ మోగింది. ఇలా 2019 నుంచి 2021 వరకు మూడు దశల్లో కరోనా విజృంభించగా... ఇందులో వేల మంది మృతి చెందిన వారు లేకపోలేదు. కరోనా మూలంగా ఉమ్మడి జిల్లాలో అప్పట్లో సుమారు 2 వేల మందికి పైగా మృతి చెందారు. దీంతో రాష్ట్రంలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో తిరిగి వైద్య ఆరోగ్యశాఖలో ఆందోళన మొదలైంది.

పెరుగుతున్న కొత్త వేరియంట్లు

కోవిడ్-19 వైరస్ కొత్త వేరియంట్లు, ముఖ్యంగా ఒమిక్రాన్ ఉప-వేరియంట్లు, ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వేరియంట్లలో కోవిడ్ 8.1.3.1.1 వంటి వేరియంట్ల గురించి చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ, ఇతర ఆరోగ్య సంస్థల నివేదికల ప్రకారం, ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఉప-వేరియంట్ ఎక్కువగా వ్యాపిస్తోంది. అమెరికాలో 70 శాతం కోవిడ్ కేసులు. యూకేలో 60 శాతం కేసులు, ఆస్ట్రేలియాలో మూడో అత్యంత ప్రబలమైన వేరియంట్.8.1 ఉంది. ఇతర రాష్ట్రాల్లోనూ కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

కనిపించని ముందస్తు చర్యలు

జిల్లాకు కరోనా వ్యాప్తి పొంచి ఉంది. జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనే ఉన్నాయి. అక్కడ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దీనికితోడు ఆ రాష్ట్రాల నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన ఆస్పత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కరోనాకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిన ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బెడ్లు, ఆక్సిజన్ , వెంటిలేటర్లు , పరీక్ష కిట్లు తదితర ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోవిడ్ కోసం ప్రత్యేక బెడ్లు కేటాయించడంలో అలసత్వం చూపుతున్నారు. దీని బట్టిచూస్తే జిల్లాకు కరోనా ముప్పు తప్పేలా లేదని ఆస్పత్రి వర్గాలే చెబుతున్నాయి. గతంలో కరోనా అంటేనే ఆస్పత్రుల్లో చకచకా ముందస్తు ఏర్పాట్లు జరిగేవి. ప్రణాళిక ప్రకారం బెడ్లు కేటాయింపు జరిగేవి. పరీక్షల కోసం కిట్లు అందుబాటులోకి తెచ్చేవారు. సీఎం చంద్రబాబు జిల్లాలోనే ఇంత నిర్లక్ష్యం ఉంటే..మిగతా జిల్లాల పరిస్థితి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోవిడ్‌కు ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



లక్షణాలు ఇవీ..

జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. ఆరోగ్యశాఖకు చెందిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌ల్లో మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని ఆదేశించింది. వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేశారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్ష సౌకర్యాలతో కూడిన 24 గంటలు పనిచేసే ల్యాబ్‌లో మాస్కును పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులు తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. రెండున్నర సంవత్సరాల విరామం తర్వాత దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. చెన్నై, కర్ణాటక రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. రోగులు తేలికపాటి ఒత్తిడితో బాధ పడుతున్నట్లు గుర్తించారు.



ఏర్పాట్లు చేస్తాం

కోవిడ్‌కు సంబంధించి మూడు రోజులకు ముందు ఎలాంటి ఆదేశాలు రాలేదు. శనివారం ఆదేశాలు వచ్చాయి. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తాం. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అన్ని ఆస్పత్రులకు ఆదేశాలిస్తాం. బెడ్లు కేటాయిస్తాం. వారికి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

– పద్మాంజలి దేవి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు



భయపడాల్సిన పనిలేదు

కొత్త వేరియంట్‌కు భయపడాల్సిన పనిలేదు. అలా అని నిర్లక్ష్యంగా ఉండకూడదు. తగిన జాగ్రత్తలతో బయటకు రావాలి. కోవిడ్ నియమ నిబంధనలు పాటించాలి. వృద్ధులు, చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కోవిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికెళ్లి పరీక్షలు చేయించుకోండి. నిర్లక్ష్యం లేకుండా కోవిడ్ జాగ్రత్తలు పాటించాలి.

– సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు



స్వల్పంగా గాయపడిన చాంద్‌బాషా



ప్రమాదానికి కారణమైన బల్లి



మృతి చెందిన రఫీ (ఇన్‌సెట్) రఫీ (ఫైల్)

పాకాల: దామలచెరువులో ఆదివారం విద్యుత్ తీగ తెగి మీద పడడంతో ఆటోలో కూర్చున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పాకాలలోని ఆజాద్‌నగర్‌కు చెందిన మీరాసాహెబ్ కుమారుడు జి.రఫీ, రాజీవ్ కాలనీకి చెందిన ఖాదర్‌బాషా కుమారుడు చాంద్‌బాషా దామలచెరువు మామిడికాయల మండీల్లో పనిచేస్తున్నారు. వారు ఆదివారం మండీలో పని ముగించుకుని మరో మండీలో పని చేయడానికి వెళుతూ ఆర్‌పీఎం మామిడి మండీ వీధి వద్ద ఆపి వున్న ఆటోలో కూర్చున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగ తెగి ఆటోపై పడింది. ఆటోకు విద్యుత్ సరఫరా కావడంతో ఆటోలో ఉన్న రఫీ(27) అక్కడికక్కడే మృతి చెందాడు. చాంద్‌బాషా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రఫీ మృతదేహాన్ని చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సంజీవరాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బల్లి కారణంగానే ప్రమాదం

విద్యుత్ తీగ తెగిన స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం పైకి బల్లి ఎక్కింది. స్తంభానికి అమర్చిన ఇనుప యాంగిల్ నుంచి ఇన్సులేటర్ ద్వారా విద్యుత్ తీగను తాకడంతో ప్రమాదం చోటు చేసుకుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎం.హరిప్రసాద్ తెలిపారు. ఇనుప యాంగిల్, ఇన్సులేటర్, విద్యుత్ తీగను ఒకే సారి బల్లి తాకడం వల్లే విద్యుత్ తీగ తెగి కింద ఉన్న ఆటోపై పడడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించిందన్నారు. ఈ ఘటనలో ఆటోకి ఉన్న సైడ్ గ్రిల్స్ పట్టుకోవడంతో రఫీకి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందినట్లు భావిస్తున్నామని తెలిపారు. ఆటో కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు.

ఈఓ ఎవడ్రా.. ఇక్కడ మాదే రాజ్యం

- స్విమ్స్‌లో సెక్యూరిటీ సిబ్బంది ఆగడాలు
- రోగులు.. సహాయకులపై యథేచ్ఛగా దాడులు
- చేతులెత్తేస్తున్న ఆస్పత్రి అధికారులు



రోగుల సహాయకులతో సెక్యూరిటీ వాగ్వాదం (ఫైల్)



ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌కు తాళం వేసిన దృశ్యం

- అనారోగ్యంతో ఉన్న తన భర్తకు వైద్యం చేయించేందుకు అనంతపురం నుంచి ఓ మహిళ స్విమ్స్‌కు వచ్చింది. జనరల్ ఫిజీషియన్ ఓపీ చూపించుకునేందుకు వెళుతుండగా అడుగడుగునా సెక్యూరిటీ ఇబ్బంది పెట్టారు. దీంతో ఆమె సకాలంలో ఓపీ తీసుకోలేక వెనుతిరిగింది. బాధితురాలు మాట్లాడుతూ మహిళ అని కూడా చూడకుండా సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని కంటతడి పెట్టుకుంది. ఊరు కానీ ఊరు వచ్చిన మాతో ఇలా వ్యవహరించడం సరి కాదని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త అనారోగ్యం కంటే సెక్యూరిటీ తీరే ఎక్కువ బాధించిందని వెల్లడించింది.


ఇది మచ్చుకు ఒకటే.. ఇలాంటివి తిరుపతి స్విమ్స్‌లో నిత్యం జరుగుతూనే ఉంటాయి. సెక్యూరిటీ సిబ్బంది కారణంగా రోగులు.. సహాయకులకు అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి.

తిరుపతి తుడా : టీటీడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్విమ్స్ ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది ఆగడాలు శృతి మించాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో రోగులు.. సహాయకులకు దిక్కు తోచని పరిస్థితులు తలెత్తుతున్నాయి. కనీస మర్యాదలేకుండా ఆస్పత్రికి వచ్చిన వారితో సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ప్రశ్నించిన వారిపై యథేచ్ఛగా దాడులకు తెగబడుతున్నారు.

నెట్టేస్తూ.. తరిమేస్తూ..

స్విమ్స్‌లోని ఎమర్జెన్సీ, ఐసీయూ, ఆర్ఐసీయూ విభాగాల వద్ద రోగుల సహాయకులు కనిపెట్టుకుని ఉంటారు. లోపల చికిత్సపొందుతున్న వారికి ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని కూర్చొని ఉంటారు. రాత్రివేళల్లో ఆయా విభాగాల వెలుపలే నిద్రిస్తుంటారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది మాత్రం రోగుల సహాయకులను పురుగుల కంటే హీనంగా విదిలించేస్తున్నారు. ఇక్కడ ఎవరూ ఉండకూడదు అంటూ తరిమేస్తున్నారు. తమ వారికి అకస్మాత్తుగా ఏదైనా అవసరం వస్తే అందుబాటులో ఉండాలి కదా అని సహాయకులు సమాధానమిస్తే అసభ్యంగా దూషిస్తున్నారు. బలవంతంగా ఆయా ప్రాంతాల నుంచి నెట్టేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల బుధవారం రాత్రి 11 గంటల సమయంలో రోగుల సహాయకులపై దౌర్జన్యానికి దిగారు. టీటీడీ ఈఓకు ఫిర్యాదు చేస్తామంటే దాడి చేశారు. ''ఈఓ ఎవడ్రా.. ఇది మా రాజ్యం.. ఇక్కడ మేం చెప్పిందే జరుగుతుంది'' అంటూ రోగుల సహాయకులను నిర్ధాక్షిణ్యంగా తోసేశారు. పైగా బాత్‌రూమ్‌లకు తాళాలు వేసి మీ దిక్కున్నచోట చెప్పుకోండని వెళ్లిపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి స్విమ్స్‌లో సెక్యూరిటీ సిబ్బంది ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు. లేకుండా ఉన్నత ఆశయంతో నెలకొల్పిన ఆస్పత్రి ప్రతిష్ట మసకబారుతుందని హెచ్చరిస్తున్నారు.

2 నుంచి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



గోవిందరాజస్వామి ఆలయం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. 1వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తారు. 2న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 3న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 4న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 5న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 6న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 7న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, 8న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 9న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 10న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఉత్సవ మూర్తులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: గోవిందరాజస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నాముకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని షార్ ఫ్లెటై వర్ బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కృష్ణా జిల్లాకు చెందిన అనిల్, గణేష్, ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తులు శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ సూళ్లూరుపేటలో నివసిస్తున్నారు. ఈక్రమంలో బైక్‌పై ముగ్గురూ వస్తూ ఎదురుగా ట్రాక్టర్‌ను తప్పించబోయి ఆటోను ఢీకొన్నారు. దీంతో పక్కనే ఉన్న ఫ్లైఓవర్ డివైడర్‌పై పడ్డారు. ఈ ప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన గణేష్, ప్రేమకుమార్‌ను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

పీజీసెట్‌కు 25,688 మంది దరఖాస్తు

- ముగిసిన ఏపీ పీజీసెట్ దరఖాస్తుల గడువు
- కెమికల్, లైఫ్ సైన్స్ కోర్సుల వైపు మొగ్గు
- 30 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- గత ఏడాది కంటే 7 వేలు తగ్గిన వైనం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీపీజీసెట్–2025 దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. అపరాధ రుసుముతో ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో ఏపీ పీజీ సెట్‌కు 25,688 దరఖాస్తులు అందినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. 9వ తేదీ నుంచి పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 30 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సుమారు 153 పీజీ కోర్సులలో ప్రవేశాలకు 31 పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలలో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఏపీపీజీసెట్ పరీక్షకు హాజరుకానున్నారు.

తగ్గిన దరఖాస్తులు

గత ఏడాది పీజీసెట్‌కు 32 వేలకు పైగా దరఖాస్తులు రాగా ఈ ఏడాది అందులో 7వేలు తగ్గడం గమనార్హం. 153 కోర్సులలో సుమారు 25 వేల సీట్లు ఉండగా 25,688 దరఖాస్తులు రావడంతో పీజీ కోర్సులలో ప్రస్తుతం ఉన్న సీట్లకు... అందిన దరఖాస్తులతో పోలిస్తే కాంపిటీషన్ 1 : 1గా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ ఏడాది పీజీసెట్‌కు దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి పీజీ సీటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఏపీ పీజీ సెట్‌కు దరఖాస్తుల వివరాలు

కోర్సు	అందిన దరఖాస్తులు
కెమికల్ సైన్స్	6,070
లైఫ్ సైన్స్	4,027
కంప్యూటర్	2,333
కామర్స్	1,438
ఇంగ్లిష్	898
హ్యుమానిటీస్	883
జువాలజీ	1,548
గణితం	1,175
ఫిజిక్స్	938
బాటనీ	1295
మిగిలిన అన్ని కోర్సులకు	5,083

అక్రమ కట్టడం.. అడ్డుకున్న యంత్రాంగం



పిల్లర్లను తొలగించేందుకు యత్నిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తరం వైపు ఉన్న గొడ్డేరు కాలువలో అన్నదానం, అభిషేకాలకు సంబంధించి నీరు వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా ఉన్న కాలువను ఆక్రమిస్తున్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఆదివారం అక్రమ కట్టడాలను గుర్తించి అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి కాలువను పూడ్చి దానిపై కట్టడాలు, పిల్లర్లను కట్టడంపై డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు నిలుపుదల చేసినట్లు తెలిపారు. పురపాలక సంఘానికి ఫిర్యాదు చేసి సర్వే నిర్వహించి ఎంత ఆక్రమణకు గురైందో తెలుసుకుని స్వాధీనం చేసుకుంటామన్నారు. గొడ్డేరును అనుకుని ఉన్న చాలావరకు స్థలాలు కాలువ పొరంబోకు కిందకు వస్తాయి. అయితే తమకు పేపర్లు ఉన్నాయని కాలువపై నిర్మాణాలు చేపడుతున్న వారికి తెలియజేశారు. కాలువ కూడా తమదే అన్నట్లుగా ఆక్రమణదారులు చెబుతున్నట్లు సమాచారం. అయితే ఆలయ అధికారులు కాలువపై కట్టడాలను తొలగించారు. దీనిపై పురపాలకసంఘ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, దేవస్థానం వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, అసిస్టెంట్ సీఈఓ సుదర్శన్‌రెడ్డి, హోంగార్డులు, ఆలయ సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.